
సాక్షి గుంటూరు

శనివారం, 21, అక్టోబర్, 2023



రామాలయంలో మంత్రి రోజా

మంగళగిరి : రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం నూతక్కి అన్నపురెడ్డి రామాలయాన్ని సందర్శించారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4,322 క్యూసెక్కులు విడుదల చేశారు.

పోలీస్ అమర వీరుల స్థూపం సిద్ధం



నగరంపాలెం(గుంటూరు): పోలీస్ అమర వీరుల దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గుంటూరు నగరంపాలెంలోని అమరవీరుల స్థూపం ముస్తాబైంది. శనివారం ప్రత్యేక కార్యక్రమం జరగనుంది.

న్యూస్‌రీల్

వీణాపాణిగా బాలచాముండేశ్వరి



అమరావతి: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అమరావతి బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శుక్రవారం బాలచాముండేశ్వరిని చదువులతల్లి సరస్వతిదేవిగా అలంకరించారు. ఆశ్వీయుజ శుద్ధసప్తమి మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతిదేవి అలంకారంలో బాలచాముండేశ్వరి భక్తుల పూజలందుకున్నారు. అర్చకులు సహస్ర కుంకుమార్చన, దేవిఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీచక్రార్చన నిర్వహించారు. అలాగే ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్ధని అమ్మవార్లకూ ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేసి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

రైతుల సమక్షంలో రీసర్వే పనులు పూర్తిచేయండి

నరసరావుపేట: భూములు రీ–సర్వే పనులు రైతుల సమక్షంలో చర్చించి త్వరిత గతిన పూర్తి చేయాలని సంబంధిత డివిజనల్, మండల రెవెన్యూ అధికారులు, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి డీఆర్వో, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సంబంధిత జిల్లా అధికారులతో వెబెక్స్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసైన్డ్, ఇనాం భూములు, మ్యుటేషన్ కన్వర్షన్, సబ్ డివిజన్, ఎఫ్–లైన్ పిటిషన్లు వ్యవసాయ భూముల మార్పులు వంటి విషయాలపై సుదీర్ఘంగా చర్చించి పలు సలహాలు అందజేశారు.

రద్దయిన రైళ్లు పునరుద్ధరణ

లక్ష్మీపురం(గుంటూరు పశ్చిమ) : సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం దసరా పండుగను పురస్కరించుకుని గతంలో రద్దయిన రైళ్లను ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు పునరుద్ధరించినట్లు సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నంబర్ 07783 విజయవాడ–గుంటూరు రైలు, 07779 గుంటూరు–మాచర్ల,
07580 మాచర్ల–నడికుడి, 07579 నడికుడి–మాచర్ల, 07780 మాచర్ల–గుంటూరు, 07788 గుంటూరు–మాచర్ల రైళ్లను ఈనెల 23 నుంచి 26 వరకు కేటాయించినట్లు తెలిపారు.

ఐదు నూతన ఇసుక రీచ్‌లకు ఆమోదం

గుంటూరు వెస్ట్ : ఇసుక రీచ్‌ల అనుమతులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పక పాటించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక రీచ్‌ల కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ సిఫార్సు చేసిన ఐదు ఇసుక రీచ్‌లకు అనుమతులు ఆమోదిస్తున్నామని చెప్పారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఐదుగురికి ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి

నగరంపాలెం(గుంటూరు పశ్చిమ): ఐదుగురు ఏఎస్ఐలకు ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న బి.సాంబశివరావు, వి.సత్యనారాయణ, ఎం.ఎస్.వెంకటేశ్వర్లు, వై.సుబ్బారావు, ఎస్.ఎం.సుభానీలకు ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి కల్పించి గుంటూరు జిల్లాకు కేటాయించారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు సదవకాశం

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లింపు గడువును బోర్డు పొడిగించినట్టు పల్నాడు జిల్లా డీఐఈఓ ఎం.నీలావతిదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెలలో జరగనున్న పరీక్షల ఫీజు గడువును నవంబర్ 30వ తేదీ వరకు పొడిగించినట్టు వివరించారు. జిల్లాలో ఇంటర్మీడియెట్ ఫెయిలై, డ్రాపవుట్స్, జనరల్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఫెయిలైన విద్యార్థి అడ్మిషన్ పొంది అన్ని పరీక్షలకు హాజరైతే ఎక్కువ మార్కులు వచ్చిన దానిని పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.



కళాకారిణి నృత్యనీరాజనం



అమ్మ దర్శనానికి తరలివస్తున్న భక్తులు

జనఝురి.. భక్తి హారతి



వీణాపాణిగా అమ్మవారు

- మూలానక్షత్రం నేపథ్యంలో కిక్కిరిసిన దుర్గమ్మ కొండ
- సరస్వతీదేవిగా కొలువుదీరిన అమ్మవారు
- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అమ్మ చిత్రపటం బహూకరిస్తున్న దేవదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ

దకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా మహోత్సవాలలో అత్యంత కీలకమైన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా పోలీసు, రెవెన్యూ, దేవదాయ శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలు తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. వినాయకుడి గుడి నుంచి ప్రారంభమైన భక్తులు అమ్మవారిని దర్శించుకొని కొండ దిగేందుకు మూడు నుంచి నాలుగు గంటలు పట్టిందని భక్తులు పేర్కొంటున్నారు. సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకూడదనే భావనతో అమ్మవారి దర్శనానికి విచ్చేసే ప్రతి ఒక్కరిని క్యూలైన్‌లోనే కొండపైకి అనుమతించారు. కొండపైకి పూర్తిగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కేవలం వీవీఐపీల వాహనాలను మాత్రమే అనుమతించారు.

పూజలు ఇలా..

తెల్లవారుజామున అమ్మవారికి సరస్వతీదేవిగా అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం 1.20 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు భారీగా దర్శనానికి తరలివచ్చారు.



అలంకార వైభవానికి జై



దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పలుచోట్ల విశిష్ట అలంకరణల్లో అమ్మవార్లు మెరిసిపోతున్నారు. భక్తులకు కనుల విందు చేస్తున్నారు. శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా గుంటూరు ఆర్ అగ్రహారంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా కటాక్షించారు. గీతామందిరంలో సరస్వతీదేవికి రూ.50 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

గుంటూరు పశ్చిమ టీడీపీలో లుకలుకలు

- ఉయ్యూరు వర్సెస్ కోవెలమూడి
- నువ్వెంత అంటే నువ్వెంత అంటూ వాదులాట
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి కోవెలమూడి ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు పశ్చిమ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో లుకలుకలు బయటపడ్డాయి. పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కోవెలమూడి రవీంద్ర(నాని) వ్యవహరిస్తున్నారు. అయితే ఈ సీటును ఆశిస్తున్న ఎన్ఆర్ఐ ఉయ్యూరు ఫౌండేషన్ అధినేత ఉయ్యూరు శ్రీనివాస్ కూడా గత ఏడాది కాలంగా ఈ సీటుపై కన్నేశారు. జనవరి ఒకటిన పేదలకు చీరల పంపిణీ పేరుతో కార్యక్రమం నిర్వహించి తొక్కిసలాటలో ముగ్గురు మృతి చెందడానికి కారణమయ్యారు. ఆ తర్వాత కొద్ది కాలం స్తబ్దుగా ఉన్నా తర్వాత పెళ్లి కానుక పేరుతో ఒక కార్యక్రమం నిర్వహించారు. ఇప్పుడు తాజాగా 50 వేల కుటుంబాలను కలుస్తానంటూ ఇంటింటికీ తిరగడం ప్రారంభించారు. శుక్రవారం నల్లచెరువు 23వ లైన్‌లో ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుస్తున్న సమాచారం అందుకున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోవెలమూడి రవీంద్ర అక్కడికి చేరుకున్నారు. గతంలో ఇద్దరూ కలిసి తిరగాలని, విడిగా తిరగవద్దని అధిష్టానం చెప్పినా ఒక్కడివే ఎందుకు తిరుగుతున్నావంటూ ఉయ్యూరు శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. దీనికి ఉయ్యూరు శ్రీనివాస్ స్పందిస్తూ 'నా ఇష్టం నేను ఒక్కడినే తిరుగుతాను' అంటూ సమాధానం చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ వాదులాడుకున్నారు. 'రేపు మళ్లీ ఇక్కడే కార్యక్రమం చేస్తాను నువ్వు ఏం చేసుకుంటావో చేసుకో' అంటూ శ్రీనివాస్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత కోవెలమూడి రవీంద్ర ఈ వ్యవహారంపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

కౌలు రైతులకు పంట రుణాలు అందించాలి

జేసీ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: జిల్లాలో కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డులు అందించడంతోపాటు, పూర్తిస్థాయిలో పంట రుణాలు అందించేలా బ్యాంకు అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ కౌలు రైతులకు పంట రుణాల మంజూరుకు ప్రత్యేకంగా బ్యాంకర్లతో టీసీసీ సమావేశం నిర్వహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రబీలో మినుము, పెసలు వంటి ఆరుతడి పంటలు సాగు చేసేలా ఇప్పటి నుంచే వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కృష్ణా డెల్టా పరిధిలో లభ్యతమేరకు సాగునీటిని చివరి భూముల వరకు సక్రమంగా అందించాలన్నారు. మంజూరు చేసిన డ్రిప్ స్ప్రింక్లర్ల యూనిట్లు త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా మరింత ఎక్కువగా ఎరువుల విక్రయాలు జరిగేలా చూడాలన్నారు. జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా పాడి గేదెల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరయ్యేలా పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాబార్డు అగ్రికల్చర్ మార్కెటింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ఏర్పాటుకు అవకాశం ఉన్న పరిశ్రమలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఏపీఎంఐపీ ప్రాజెక్టు మేనేజర్ వజ్రశ్రీ, లీడ్‌బ్యాంక్ మేనేజర్ మణిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వందశాతం ఫీజు వసూలే లక్ష్యం

మార్కెటింగ్‌శాఖ ఆర్‌జేడీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కాకుమాను శ్రీనివాసరావు
వేదికపై ఝాన్సీరాణి, రాజబాబు

కొరిటిపాడు(గుంటూరు): వ్యవసాయ మార్కెట్ యార్డులకు నిర్దేశించిన ఫీజు వసూలు లక్ష్యాలు 100 శాతం సాధించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల అధికారులను మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ) కాకుమాను శ్రీనివాసరావు ఆదేశించారు. గుంటూరులోని మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ఏడీఎంలు, డీడీఎంలు, మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మొదటి ఆరు నెలల కాలంలో పలు మార్కెట్ యార్డుల పరిస్థితి ఆశాజనకంగా ఉన్నా.. పలు మార్కెట్ కమిటీలు మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యం బాగా తగ్గిందన్నారు. గతేడాది మాదిరిగానే అన్ని మార్కెట్ కమిటీల లక్ష్యానికి మించి వసూలయ్యేలా విజిలెన్స్ చర్యలు పటిష్టం చేయాలని ఆదేశించారు. రైతులకు సేవలందిస్తూనే యార్డుల అభివృద్ధికి ఆదాయ మార్గాలు అన్వేషించాలన్నారు. చెక్‌పోస్టుల ద్వారా వసూళ్లు పెరగాలన్నారు. మార్కెట్ యార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నిర్మిస్తున్న మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలుకు మార్కెట్ యార్డుల్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పత్తి రైతులకు ఇబ్బందులు లేకుండా నిబంధనల మేరకు పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో మార్కెటింగ్‌శాఖ డెప్యూటీ డైరెక్టర్ ఝాన్సీరాణి, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ఏడీఎంలు బి.రాజబాబు, కె.ప్రకాష్ రెడ్డి, కె.రమేష్‌బాబు, మూడు జిల్లాల మార్కెట్ యార్డుల కార్యదర్శులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో 24/7 వైద్య సేవలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో దసరా మహోత్సవాల్లో 24 గంటలూ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని చెప్పారు. అనారోగ్యానికి గురైన వారికి ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కాగా శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వైద్య శిబిరాల్లోని వైద్యులు, సిబ్బందిని ఆమె అప్రమత్తం చేశారు. నిరంతరం వైద్య శిబిరాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని అప్రమత్తం చేస్తూ, నీరసించిన వారికి తక్షణ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఓం టర్నింగ్ పాయింట్ వద్ద స్పృహ కోల్పోయిన భక్తుడికి చికిత్స అందించడం ద్వారా సాధారణ స్థితికి తీసుకువచ్చారు.





ఉద్యోగుల స్పందనకు హాజరుకావాల్సిందే

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖర రావు, డిప్యూటీ కలెక్టర్ స్వాతితో కలిసి నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసే ఉద్యోగుల కనీస సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు. అర్జీల సమస్యలు పరిష్కరించే క్రమంలో ఇబ్బందులుంటే తమవద్దకు తీసుకురావాలని తెలిపారు. అనంతరం వచ్చిన 19 అర్జీలను అధికారులతో కలిసి పరిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు, జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, డ్వామా పీడీ యుగంధర్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యార్డులో 15,661 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 14,480 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 15,661 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.14,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 7,040 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అమెరికా తెలుగు సాహిత్య సదస్సుకు 'బీరం'

చీరాల అర్బన్: ఈనెల 21 ,22 తేదీల్లో అమెరికాలోని సిలికానాంధ్ర యూనివర్శిటీలో జరగనున్న అమెరికా తెలుగు సాహిత్య సదస్సులో ప్రసంగించేందుకు ఆహ్వానం అందినట్లు ప్రముఖ కవి డాక్టర్ బీరం సుందరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీరాలకు చెందిన విశ్రాంత తెలుగు అధ్యాపకులు, ప్రముఖ కవి డాక్టర్ బీరం సుందరరావుకు వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు వివిధ దేశాలకు చెందిన తెలుగు కవులు, రచయితలు హాజరవుతున్నారు. సుందరరావు 'తెలుగు కవిత్వంలో కొత్త గొంతులు' అనే అంశంపై ప్రసంగించనున్నారు. ఈ ఏడాది జులైలో అమెరికాలో జరిగిన తానా మహాసభలకు ఆయన హాజరయ్యారు. రచయితలు, వివిధ సంస్థల ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- ఫిష్ ఆంధ్ర వెండింగ్ యూనిట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: గతంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులను పట్టించుకోలేదని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మత్స్యకారులను గుర్తించి వారి జీవితాలలో వెలుగులు నింపేలా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. నగరంలోని తెనాలి ఫ్లై ఓవర్ వద్ద తాగునీటి పథకం పక్కన నూతనంగా నిర్మించిన ఫిష్ ఆంధ్ర వెండింగ్ యూనిట్ల దుకాణాలను శుక్రవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ఫిష్ ఆంధ్ర ద్వారా 17 దుకాణాలు (వెండింగ్ యూనిట్ల)ను ప్రారంభించి మత్స్యకారులకు కేటాయించడం జరిగిందన్నారు.


వెండింగ్ యూనిట్‌ను ప్రారంభించి చేపలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

సుమారు రూ.2 లక్షల విలువ కలిగిన ఒక్కో యూనిట్‌ను మత్స్యకారులపై ఆర్థిక భారం పడకుండా 70 శాతం సబ్సిడీతో అర్హులకు కేటాయించడం జరిగిందన్నారు. అందులో 25 శాతం రూ.18 వేలు కేంద్ర ప్రభుత్వం, మిగిలిన 75 శాతం రూ.55లు రాష్ట్ర ప్రభుత్వం భరించడం జరుగుతుందన్నారు. మిగిలిన రూ 1 లక్షా 30 వేలు దుకాణదారులపై భారం పడకుండా డ్వాక్రా సంఘాల ద్వారా పావలా వడ్డీకే రుణాలు అందజేసి ఫిష్ ఆంధ్ర దుకాణాలను ఏర్పాటు చేసి మత్స్యకారులకు భరోసా కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, పట్టణ జేసిఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, పార్టీ నాయకులు నెరేళ్ళ మురళి, కుంచాల కృష్ణ కిషోర్, కొల్లి శేషిరెడ్డి, దేవళ్ళ సుబ్బారావు, బేతపూడి నరసయ్య, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, దొడ్డక కృష్ణ, తాడిబోయిన సురేష్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు జరిగేదిక్కడే

గుంటూరు వెస్ట్ (క్రీడలు): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాల బాలికల క్రీడా పోటీలను కింది తెలిపిన తేదీల్లో నిర్వహిస్తామని నిర్వహణా కార్యదర్శి జి.ప్రతాప్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న అండర్-14, 17 బాల బాలికల సాఫ్ట్ టెన్నిస్ పోటీలను తాడికొండలోని ఎస్‌వీఎస్ స్కూల్లో నిర్వహిస్తామన్నారు. 27వ తేదీన అండర్-14, 17 బాల బాలికల లాన్ టెన్నిస్ పోటీలను స్థానిక బీఆర్ స్టేడియంలోనూ ఏర్పాటు చేశామన్నారు. టెన్నిస్ బాల్‌ను క్రీడాకారులే తెచ్చుకోవాలన్నారు. బొప్పుడిలోని జడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో టెన్నికాయిట్ పోటీలు, తక్కెళ్లపాడులోని జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో అండర్-14 బాల బాలికల త్రోబాల్ పోటీలను, గుంటూరులోని శుభం క్రికెట్ అకాడమీలో అండర్-14, 17 బాల బాలికల ఆర్చరీ పోటీలు ఉంటాయన్నారు. 28వ తేదీన పెరవలిలోని జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో అండర్-17 త్రోబాల్ పోటీలు, గుంటూరులోని ఉర్దూ బాయ్స్ హైస్కూల్లో అండర్-14, 17 బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు, అండర్-14, 17 బాల బాలికల అథ్లెటిక్ పోటీలను స్థానిక బిఆర్ స్టేడియంలోనూ ఏర్పాటు చేసామన్నారు.

పత్తి రైతులూ.. బహుపరాక్!

- దళారుల మాటలతో మోసపోవద్దు
- జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి
- క్వింటా పత్తికి కనీస మద్దతు ధర రూ.7020

గుంటూరు వెస్ట్: క్వింటా పత్తికి ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.7020 ఇస్తోందని, పత్తి రైతులు దళారుల మాటలకు మోసపోవద్దని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో నిర్వహించిన పత్తి కొనుగోళ్లకు సంబంధించిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి పత్తి రైతులు సమీప రైతుభరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకుని సమీపంలో ఉన్న జిన్నింగ్ మిల్లువద్దకు వెళ్లి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అమ్ముకోవాలన్నారు.

జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గుంటూరు మార్కెట్ యార్డు పరిధిలో 3,


అధికారుల సమావేశంలో జేసీ

తాడికొండలో 2, ఫిరంగిపురంలో 1, ప్రత్తిపాడులో 4 మొత్తం 10 కేంద్రాలను గుర్తించామన్నారు. గుర్తించిన మిల్లుల్లోగాని, మార్కెట్ యార్డుల్లోకి గాని దళారులు ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ క్రమంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసుకోవాలని జేసీ వివరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ డీడీ బి.రాజబాబు, ఉదయ్ ఆర్ షా, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మకరంద మాధుర్యం శంకర సాహిత్యం

డాక్టర్ గరికపాటి నరసింహారావు



పాత గుంటూరు: శంకర సాహిత్యం దివ్యానంద మకరంద మాధుర్యమని పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. శుక్రవారం శ్యామలానగర్ శ్రీ గణేష్ గాయత్రి సంతోషి మాత దేవాలయం ప్రాంగణంలో వేద పరిషత్ స్వర్ణోత్సవాలలో భాగంగా గరికపాటి నరసింహారావు ప్రవచనంలో ఆదిశంకరుల అద్వైతామృత తత్త్వం గురించి వివరించారు. పండిత పామర జనరంజకమై విరాజిల్లిన సాహిత్యాన్ని ఆదిశంకరులు సృష్టించారన్నారు. ప్రాణాయామ అభ్యాసం వల్ల మనస్సు నెమ్మదిస్తుందన్నారు. పువ్వు, నవ్వు చూడగలిగితే ఆత్మ మేల్కొంటుందన్నారు. ఆధ్యాత్మిక అభివృద్ధే నిజమైన అభివృద్ధి అని చెప్పారు, అద్దంలో కనిపించే నగరం అద్దం తీయగానే మాయమైనట్టు జగత్ కూడా మిథ్య అన్నారు. కార్యక్రమంలో వేదపరిషత్ కార్యదర్శి సింహాద్రి శాస్త్రి, కార్యవర్గ సభ్యులు, వేద విద్యార్థులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

రేపు మంచాలలో బజరంగ్ 'నేత్రజ్యోతి'

ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ



చేబ్రోలు: ఆరోగ్యవంతమైన జీవితం ప్రతి ఒక్కరికీ దక్కాలనే మానవీయ కోణంతో 'సర్వేంద్రియాణం నయనం ప్రధానం' అన్న సూక్తి స్ఫూర్తిగా నేత్ర జ్యోతి పేరుతో బజరంగ్ ఫౌండేషన్ పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. రంగుల ప్రపంచాన్ని సాక్షాత్కారం చేసే కంటి చూపును తిరిగి పొందిన వారి కళ్లలో కనిపించే సంతృప్తి ముఖ్యమని, బజరంగ్ ఫౌండేషన్ 'నేత్ర జ్యోతి' కార్యక్రమంలో అంతర్లీనంగా ఉన్న భావోద్వేగం ఇదేనని స్పష్టం చేశారు. చేబ్రోలు మండలం మంచాల, తోట్లవారిపాలెం, శ్రీరంగపురం గ్రామాల ప్రజల కోసం మంచాల గ్రామంలో ఆదివారం బజరంగ్ నేత్రజ్యోతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతులు, రైతు కూలీలు, వెనుకబడిన వర్గాలు, హరిజన, గిరిజన బడుగు బలహీన వర్గాల ప్రజలు అధికంగా ఉన్న చేబ్రోలు మండలం, మంచాల, తోట్లవారిపాలెం, శ్రీరంగపురం గ్రామాల ప్రజలకు మంచాల గ్రామం కేంద్రంగా నేత్ర జ్యోతి శిబిరాన్ని ఏర్పాటు చేయడం వెనుక జగనన్న సంక్షేమ స్ఫూర్తి దాగి ఉందన్నారు. కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా జరిగే ఈ శిబిరం ద్వారా నేత్ర సమస్యల నుంచి గ్రామ ప్రజలందరికీ రక్షణ కల్పించడమే లక్ష్యంగా ఉంటుందని తెలిపారు. కంటి సమస్య ఉన్నట్లు గుర్తించిన వారికి వారం రోజుల్లోగా కళ్లజోళ్లను అందించడం జరుగుతుందన్నారు.

బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో చేపడుతున్న ప్రతి సేవా కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేసి, ఈ సేవా పరంపర సత్ఫలితాలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో అనేక గ్రామాల్లో నిర్వహించిన నేత్ర జ్యోతి శిబిరానికి అనూహ్య రీతిలో స్పందన లభించిందని చెప్పారు. ఇప్పటి వరకు సుమారు 8,900 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, అందులో 5,752 మందికి కళ్లజోళ్లు అందించడం జరిగిందని వివరించారు. మంచాల పరిసర గ్రామాల ప్రజల కోసం జరుగుతున్న ఈ కార్యక్రమంలో కళ్లజోళ్లు అవసరమైన వారికి కేవలం ఏడు పని దినాల్లోనే కళ్లజోళ్లు పంపిణీ జరుగుతుందని ఆయన తెలిపారు.

ఆర్టీసీ కండక్టర్‌కు అభినందనలు

చీరాల అర్బన్: ఆర్టీసీ డిపోలో మహిళా కండక్టర్‌కు అవార్డు లభించింది. అత్యధిక ఈపీకే సాధించిన నేపథ్యంలో శుక్రవారం బాపట్ల జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీపీటీవో వై.విజయకుమార్‌రెడ్డి నగదు బహుమతిని అందించారు. చీరాల డిపోలో పల్లెవెలుగు కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.సుజాతకుమారి గురువారం అధికంగా కిలో మీటర్‌కు రూ.60.82 తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదు బహుమతిని అందించి ప్రత్యేకంగా అభినందించారు. సిబ్బంది సమష్టి కృషితో పనిచేసి అధిక ఆదాయం తీసుకురావడం వలన సంస్థను అభివృద్ధి పథంలో నడిపించవచ్చన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జె.శ్యామలకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పాత కలప దుకాణాల్లో అగ్నిప్రమాదం

- మూడు దుకాణాలు పూర్తిగా, ఒకటి పాక్షికంగా దగ్ధం
- రూ.50 నుంచి 60 లక్షలు నష్టం

చిలకలూరిపేట: పట్టణంలోని ఓల్డ్ బ్యారన్‌నగర్ శుక్రవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో భారీ ఆస్తి నష్టం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఓల్డ్ బ్యారన్‌నగర్‌లో పాత కలప దుకాణాలు విస్తరించి ఉంటాయి. పాత భవనాలు, ఇతర కట్టడాలు కూల్చివేసినప్పుడు వాటి నుంచి వచ్చే కలపను సేకరించి తిరిగి తలుపులు, దర్వాజాలు, కిటికీలు వంటివి తయారుచేసి విక్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో ఈ దుకాణాల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

పక్కపక్కనే దుకాణాలు ఉండటంతో మూడు దుకాణాలు షెడ్లతో సహా పూర్తిగా కాలి నేలమట్టమయ్యాయి. మరో దుకాణం పాక్షికంగా కాలిపోయింది. వీటితోపాటు మంటల వేడికి దుకాణాల పక్కనే


ఆహుతి అవుతున్న కలప దుకాణాలు

ఉన్న మసీదు గోడలు సైతం బీటలు వారాయి. అన్ని దుకాణాల్లో టేకు సరుకు ఉండటంతో భారీగా నష్టం చోటుచేసుకుంది. ఈ అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు. షెడ్లు, అందులో కలపతో సహా దుకాణాలు పూర్తిగా దగ్ధం కావడంతో రూ.50 నుంచి 60 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకున్న జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్ శ్రీధర్, చిలకలూరిపేట, నరసరావుపేట అగ్నిమాపక అధికారులు మంటలను అదుపు చేశారు.

కారు ఢీకొని మహిళ దుర్మరణం

భర్తకు రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిసి వెళ్తుండగా ఢీకొట్టిన కారు


సంఘటన స్థలిలో రేఖ మృతదేహం

గుంటూరు రూరల్: భర్తకు రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిసి రోడ్డు దాటుతున్న భార్య కారు ఢీకొని మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రోశయ్య తెలిపిన వివరాల ప్రకారం నల్లచెరువు 2వ లైనుకు చెందిన ఉప్పు రేఖ వంటపని చేస్తూ జీవిస్తుంది. ఈ క్రమంలో సాయంత్రం పొత్తూరు సమీపంలో వంటపనికి వచ్చిన రేఖను కలిసేందుకు భర్త ధనమూర్తి ఆమె వద్దకు వచ్చాడు. హైవే రోడ్డుకు అవతలి వైపు దిగి రోడ్డు దాటుతుండగా చిలకలూరిపేట నుంచి వస్తున్న కారు అతనికి ఢీకొంది. ప్రమాదంలో అతనికి ఎటువంటి గాయాలు కాలేదు. అదే సమయంలో హైవే రోడ్డుకు అవతలి వైపునున్న రేఖ భర్తకు ప్రమాదం జరిగిన సంఘటన చూసి ఆవేదనతో రోడ్డును దాటుతుండగా గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళుతున్న కారు రేఖను ఢీకొంది. ప్రమాదంలో రేఖ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలిసిన నల్లపాడు పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.